రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 23, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్23, క్యాబేజీ 19, క్యారెట్ 40, దొండ 18, ఆలు 33, ఉల్లి 27, గోకర 45, దోస 23, సొర 11, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 65, అర్వి 40, మునగ 45, చిలగడదుంప 65, బీట్‌రూట్ 23, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 50. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఈటలకు కార్పొరేటర్ కళ్లెం శుభాకాంక్షలు



ఈటలను అభినందిస్తున్న నవజీవన్ రెడ్డి తదితరులు

హయత్‌నగర్: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి అపూర్వ విజయం సాధించిన బీజేపీ నేత ఈటల రాజేందర్‌ను మంగళవారం హయత్‌నగర్ డివిజన్ కారొరేటర్ క్లైం నవజీవన్ రెడ్డి పార్టీ కార్యకర్తలతో కలిసి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, పిరంద మహేష్, గోవిందా చారి, సత్యనారాయణ, గంగని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఫౌండేషన్‌కు నిత్యావసరాల వితరణ



కేక్ కట్ చేస్తున్న ఆదర్శ ఫౌండేషన్ చిన్నారులు

చైతన్యపురి: బీఆర్‌ఎస్ చైతన్యపురి సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదర్శ ఫౌండేషన్ ఆశ్రమం, వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు, వంటసామగ్రి అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులు, వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే, జీహెచ్‌ఎంసీ శానిటేషన్ మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కనకదుర్గ ఆలయ ధర్మకర్తలు కృష్ణ, శిల్ప, బీఆర్‌ఎస్ నాయకులు మోహన్‌రాజ్, జాన్‌కిరణ్, పులి కిరణ్, శ్రీధర్ నరేష్, వెంకన, గణేష్, నవీన్, కల్యాణ్, రాంబాబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి సన్మానం



నవీన్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన నవీన్‌రెడ్డిని బీఆర్‌ఎస్ సీనియర్ నేత శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం మామాడిపల్లిలో ఘనంగా సన్మానించారు. మండలాభివృద్ధికి కృషి చేయా లని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబర్ రహ్మాన్, దస్తగిరి, మహేష్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయంలో పూజలు

దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారుల తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనానికి ఉదయం నుంచే క్యూలో వేచియున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనం, నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

మన్సూరాబాద్: విద్యుదాఘాతంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మరిపల్లి గ్రామానికి చెందిన వర్కారి సత్తయ్య (45) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. మరిపల్లిలోనే నక్క ప్రభు అనే వ్యక్తి నూతనంగా నిర్మిస్తున్న భవనం వద్ద పని చేసేందుకు సత్తయ్య మంగళవారం ఉదయం 6 గంటలకు వెళ్లాడు. మొదటి అంతస్తులో పని చేస్తున్న సత్తయ్య ఐరన్ రాడ్‌ను కిందకు వేస్తుండగా.. అది పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు తాకింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అతను కింద పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం నాగోలు చౌరస్తాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు సత్తయ్య మృతి చెందినట్టు వెల్లడించారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో కాచిగూడలో నిర్వహిస్తున్న మున్నూరుకాపు హాస్టల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్.వెంకట్‌రావు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 7 వ తేదీ నుంచి 29లోగా కాచిగూడలోని ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన విద్యార్థులకు తగిన సహాయం అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు సెల్: 040–24658160, 9491627404 సంప్రదించాలన్నారు.

లక్షకు పైగా ఆధిక్యం

- లోక్‌సభ ఎన్నికల్లో ఎల్బీనగర్‌లో సాధించిన బీజేపీ
- ఏ రౌండ్‌లోనూ ఆధిక్యం చూపని కాంగ్రెస్
- 3వ స్థానానికి పరిమితమైన బీఆర్‌ఎస్



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఓట్లను లెక్కిస్తున్న అధికారులు

చైతన్యపురి: లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఓటర్లు పట్టం కట్టారు. ఏడు నియోజకవర్గాల్లో ఎల్‌బీనగర్‌లోనే ఈటలకు లక్షకు పైగా మెజారిటీ రావడం గమనార్హం. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 21 రౌండ్లలో కౌంటింగ్ జరగగా ప్రతి రౌండ్‌లో బీజేపీ అధికంగా ఓట్లు సాధించింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి రెండవ స్థానానికే పరిమితం కావాల్సి వచ్చింది. గతంలో మూడవ స్థానంలో ఉన్న బీజేపీ ఈ ఎన్నికల్లో మొదటి స్థానం దక్కించుకుని విజయం సాధించింది. రెండవ స్థానం సాధించిన బీఆర్‌ఎస్‌కు ఈసారి ఎల్‌బీనగర్‌లో 3వ స్థానం మాత్రమే దక్కింది. గత ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవంత్‌రెడ్డి మెజారిటీ ఓట్లు సాధించారు. అప్పటి ఎంపీ రేవంత్‌రెడ్డి ప్రస్తుతం ముఖ్యమంత్రి హోదాలో ఉండి మల్కాజిగిరిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం చేసినప్పటికీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఓటర్లు బీజేపీ వైపే మొగ్గు చూపారు. గత ఎన్నికల్లో రేవంత్‌రెడ్డికి వచ్చిన ఓట్లు కూడా ఈసారి కాంగ్రెస్ పార్టీ సాధించ లేకపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఘన విజయం సాధించినప్పటికీ పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం బీజేపీ ఎక్కువ ఓట్లు సాధించడం గమనార్హం.

వేరే చోట ఎమ్మెల్యేగా ఓడిన వారికి ఇక్కడ గెలుపు బాట...

వేరే ప్రాంతంలో ఎమ్మెల్యేగా ఓడిన వ్యక్తులు మల్కాజిగిరి పార్లమెంటు నుంచి పోటీ చేసి ఎంపీగా విజయం సాధించడం ఆనవాయితీగా మారింది. గత ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో ఓటమి పాలై మల్కాజిగిరిలో గెలుపొందారు. తాజా ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్‌లలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఈటల రాజేందర్ ప్రస్తుతం మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి ఎంపీ గెలుపొందడం గమనార్హం. ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఓటర్లు అప్పుడు రేవంత్‌రెడ్డికి, ఇప్పుడు ఈటల రాజేందర్‌కు మెజారిటీ ఓట్లు వేసి గెలుపు బాట వేశారు.



కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోతున్న కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి

2024లో రౌండ్ల వారీగా ఓట్ల వివరాలు..

రౌండ్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	నోటా	ఇతరులు
1.	8817	2507	1559	91	356
2.	8970	2379	1498	113	221
3.	10248	3160	1873	119	197
4.	10768	3825	2568	124	298
5.	8069	4700	1627	85	186
6	7709	3189	1856	111	174
7.	7602	3298	1761	111	152
8.	8473	5297	2317	118	256
9.	8431	3521	1660	139	155
10.	9010	4126	1994	136	262
11.	7500	3214	1269	142	132
12.	7419	3544	1372	120	128
13.	7696	3132	1384	107	396
14.	8118	2904	1405	79	115
15.	6803	3419	1813	80	189
16.	9396	3087	1633	115	135
17.	8386	3527	1527	85	136
18.	8003	3857	1629	81	180
19.	8131	2232	1174	108	92
20.	8884	2448	1468	98	145
21.	3201	773	509	37	23
మొత్తం	1,71,683	68,095	33,839	2,197	3928

2019 ఎన్నికల్లో ఎవరికి ఎన్ని ఓట్లు...

మొత్తం పోలైన ఓట్లు	2,29,944
రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్)	97,858
మర్రి రాజశేఖర్‌రెడ్డి (బీఆర్‌ఎస్)	70,454
రాంచందర్‌రావు (బీజేపీ)	53,691
నోటా	3,019
ఇతరులు	4,922
ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ మెజారిటీ	27,404

2024 ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లు

మొత్తం పోలైన ఓట్లు	2,79,436
ఈటల రాజేందర్ (బీజేపీ)	1,71,683
సునీతా మహేందర్‌రెడ్డి (కాంగ్రెస్)	68,095
రాగిడి లక్ష్మారెడ్డి (బీఆర్‌ఎస్)	33,839
నోటా..	2,197
ఇతరులు	3,626
ఎల్‌బీనగర్‌లో బీజేపీకి వచ్చిన మెజారిటీ	1,03,588

బీజేపీ విజయోత్సవ సంబురాలు



ఎస్కేడినగర్ చౌరస్తా వద్ద విజయోత్సవాలు జరుపుకుంటున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేటజోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో బీజేపీ విజయోత్సవ సంబురాలు అంబరాన్ని అంటాయి. ఆ పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. తీన్మార్ స్టెప్పులతోసందడి చేశారు. మరోసారి నరేంద్రమోదీకి ప్రజలు పట్టం కట్టడంపై వారు ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్‌కేపురంలో..

◆ సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ నినాదంతో ముందుకెళ్లిన బీజేపీ 2024 పార్లమెంటు ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించి చరిత్ర సృష్టించిందని ఆర్‌కే పురం కార్పొరేటర్ రాధధీరజ్ రెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా ఎన్‌డీఏ విజయం సాధించిన సందర్భంగా మంగళవారం ఆర్‌కేపురంలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఘన విజయం సాధించారని, ఇది అందరి సమష్టి కృషితో సాధ్యమైందని అన్నారు. బీజేపీ తెలంగాణాతో పాటు అన్ని రాష్ట్రాల్లో విజయాన్ని చాటిందన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని అన్నారు. వేడుకల్లో బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో...

మన్సూరాబాద్: బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఘన విజయం సాధించడంతో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తన కార్యాలయ ఆవరణలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. నాయకులు నాంపల్లి రామేశ్వర్, హరీష్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, సాయిరామ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీగా గెలిచిన ఈటలకు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న కొప్పుల నర్సింహారెడ్డి కుటుంబసభ్యులు

ఎస్కేడి నగర్‌లో...

బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఎస్కేడి నగర్ చౌరస్తా లో విజయోత్సవాలు నిర్వహించారు. స్వీట్స్ పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. నాయకులు నవకిషోర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రావు, ఆంజనేయస్వామి, రాజిరెడ్డి, దామోదర్‌రెడ్డి, చిత్రంజన్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు ఘన స్వాగతం

మన్సూరాబాద్: మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా విజయం సాధించిన ఈటల రాజేందర్ జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆహ్వానం మేరకు మంగళవారం రాత్రి మన్సూరాబాద్‌లోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా కార్యకర్తలు ఈటల రాజేందర్‌కు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. మిఠాయిలు పంచి బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు.



మన్సూరాబాద్‌లో బీజేపీ కార్యకర్తల సంబురాలు

గానసభ నిర్వాహకుల సేవలు అభినందనీయం



సంగీత గురువులు మంజుల, సంయుక్తలను సన్మానించిన ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జనార్దనమూర్తి

చిక్కడపల్లి: ఐదున్నర దశాబ్దాలకు పైగా పలు సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక కల్పిస్తూ త్యాగరాయగాన సభ నిర్వాహకులు కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. మంగళవారం త్యాగరాయ గానసభ 58వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్యాగరాయ గానసభ శాస్త్రీయ కళలకు ప్రాధాన్యత నిస్తుందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ, 58 ఏళ్లుగా గాన సభలో ఎందరో సంగీత, నృత్య, నాటక కళాకారులు ప్రదర్శనలిచ్చారన్నారు. సంగీత గురువు సంయుక్త శిష్యబందం, రాగరమ్య ఫైన్ ఆర్ట్స్ మంజుల శిష్యబందం శాస్త్రీయ గానగోష్టి నిర్వహించారు. సంగీత గురువులు మంజుల, సంయుక్తలను సన్మానించారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు దరఖాస్తులు

రాయదుర్గం: భారతదేశంలో ఫ్యాషన్ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని 'మనూ' డిజైనింగ్ కోర్సుల ఇన్‌చార్జి సమనా మూస్వి మంగళవారం తెలిపారు. ఈ నేపథ్యంలో మనూలో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులను ప్రారంభించామన్నారు. నాలుగేళ్ల (యూజీ కోర్సు) బీఎస్సీ, రెండేళ్ల డిప్లొమో కోర్సు, ఫ్యాషన్ డిజైనింగ్, ఇంటీరియర్ డిజైనింగ్‌లో ఒక ఏడాది కాలపరిమితితో కూడిన సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నామన్నారు.10ప్లస్ 2 లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులన్నారు. ఉర్దూ వర్శిటీ మోడల్ స్కూల్, పాలిటెక్నిక్, గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు మినహాయింపు ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో జూన్ 30లోగా దరఖాస్తు చేసు కోవాలని, మరిన్ని వివరాలకు 81065 28786లో సంప్రదించవచ్చని అన్నారు.

మలక్‌పేటలో మజ్లిస్‌దే హవా!



అంబర్‌పేట కౌంటింగ్ కేంద్రం వద్ద కార్యకర్తలతో మజ్లిస్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల

- లోక్‌సభ ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీకి 31,390 ఓట్ల మెజారిటీ
- రెండో స్థానంలో బీజేపీ అభ్యర్థి మాధవీలత
- అసెంబ్లీ ఎన్నికల కంటే అధిక ఓట్లు సాధించిన మజ్లిస్, బీజేపీలు

మలక్‌పేట: మజ్లిస్ పార్టీకి మలక్‌పేట మరోసారి కంచుకోటగా నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల కంటే ఆ పార్టీ ఇక్కడ అధిక ఓట్లు సాధించి గెలుపు బావుటా ఎగురవేసింది. అంబర్‌పేట మున్సిపల్ స్టేడియంలోని కౌంటింగ్ సెంటర్‌లో మంగళవారం మలక్‌పేట నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 3,17,636 మంది ఓటర్లు ఉండగా, 1,35,812 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 14 టేబుళ్లు ఏర్పాటు చేయగా, 22 రౌండ్లలో ఓట్లు లెక్కించారు. మొదటి రౌండ్‌లో మజ్లిస్ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ 3100 ఓట్లు లీడ్‌లో ఉన్నారు. తర్వాత 2,3,6,7 రౌండ్లలో బీజేపీ అభ్యర్థి మాధవీలత కొంత ఆధిక్యం కనబర్చారు. 8వ రౌండ్ నుంచి 22 రౌండ్లు పూర్తయ్యే వరకు మజ్లిస్ పార్టీ ఆధిక్యం కొనసాగిస్తూ 76,318 ఓట్లు సొంతం చేసుకుంది. సమీప బీజేపీ అభ్యర్థిపై 31,390 ఓట్ల ఆధిక్యం సాధించింది. బీజేపీ 44,928 ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ అభ్యర్థి వలియుల్లా సమీర్ 9,660, బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌కు 3,089, ఇతరులకు 1,817 ఓట్లు పోలయ్యాయి.

అసెంబ్లీ ఎన్నికల కంటే బీజేపీ, మజ్లిస్‌లకు అధిక ఓట్లు

అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీకి వచ్చిన ఓట్లకంటే లోక్‌సభ ఎన్నికల్లో అధికంగా వచ్చాయి. ఎమ్మెల్యే అహ్మద్ బలాలకు 55,805 ఓట్లు రాగా, ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ 76,318 ఓట్లు సాధించారు. మజ్లిస్‌కు గతం కంటే 20,513 ఓట్లు ఎక్కువ వచ్చాయి. బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్ రెడ్డికి 23,731 ఓట్లు రాగా, ఎంపీ అభ్యర్థి మాధవీలత 44,928 ఓట్లు సొంతం చేసుకున్నారు. బీజేపీకి గతం కంటే లోక్‌సభ ఎన్నికల్లో 21,197 ఓట్లు అధికంగా వచ్చాయి. బీజేపీ, మజ్లిస్ పార్టీలు అధికంగా సాధించిన ఓట్లతో పోల్చుకుంటే.. మజ్లిస్ పార్టీకి లభించిన ఓట్ల కంటే బీజేపీ 684 ఓట్లు ఎక్కువగా సాధించడం గమనార్హం.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు తగ్గిన ఓటింగ్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు పోలైన ఓట్లు గణనీయంగా తగ్గాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అక్బర్‌కు 29,699 ఓట్లు రాగా, ఎంపీ అభ్యర్థి వలియుల్లా సమీర్‌కు 9,660 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగల అజిత్ రెడ్డికి 18,646 ఓట్లు రాగా, ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌కు 3,089 ఓట్లు పడ్డాయి. దీంతో ఇరుపార్టీల అభ్యర్థులకు డిపాజిట్ దక్కే అవకాశం లేకుండాపోయింది. పోలింగ్ రోజున రెండు పార్టీల అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను కూడా కూర్చోబెట్టలేని పరిస్థితి నెలకొంది.

జీఐఎస్‌లో స్వల్పకాలిక సర్టిఫికేషన్ కోర్సులు

- 'ఎస్కీ'లో ఈ నెల 10 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు
- డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(జీఐఎస్)లో స్వల్పకాలిక కోర్సులను అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్టు ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వరరావు మంగళవారం తెలిపారు. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో 6 వారాల, 4 వారాల వ్యవధితో ఉండే రెండు ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కోర్సులను జూన్ 10వ తేదీ నుంచి నిర్వహించాలని తలపెట్టామన్నారు. అన్ని రకాల డేటాను మ్యాప్ చేసే ఏకైక వ్యవస్థ జీఐఎస్ కాబట్టి మెరుగైన కమ్యూనికేషన్ విధానంతో కూడిన సిలబస్ రూపొందించడం జరిగిందన్నారు. ఈ కోర్సులో చేరాలనుకునేవారు ఎల్‌సీఈ/ఎల్‌ఎంఈతో పాటుగా బీఈ, బీటెక్/ప్లానింగ్ లేదా ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ అర్హత, ఎంటెక్ టౌన్‌ప్లానింగ్, రిమోట్ సెన్సింగ్ జియోమ్యాటిక్స్, ఎన్విరాన్‌మెంట్ కలిగిన అభ్యర్థులు బీఎస్సీ కంప్యూటర్‌సైన్స్, కంప్యూటర్స్, ఎంఎస్సీ జీఓ ఇన్ఫర్మ్యాటిక్స్ కలిగిన అభ్యర్థులకు జీఐఎస్ సర్టిఫికేషన్ కోర్సు చేయడానికి అర్హతగా నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. చర్లపల్లి పోలీసుల కథనం ప్రకారం.. సాయినగర్ కాలనీకి చెందిన కాటేపల్లి పవన్ కుమార్‌రెడ్డి కుమారుడు వివేకానందరెడ్డి(16)విద్యార్థి. కుషాయిగూడకు చెందిన స్నేహితులు రిత్విక్, శివతో కలిసి బైక్‌పై చక్రిపురం నుంచి చిన్న చర్లపల్లికి వేగంగా వెళ్తుండగా.. మోడీ అపార్ట్‌మెంట్స్ వద్ద అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. దీంతో వివేకానందరెడ్డి ఎడమ కాలు, తొడ, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.